క్లుప్తంగా

తొలిరోజు నామినేషన్లు నిల్

రాజమహేంద్రవరం రూరల్: రాజమండ్రి రూరల్ అసెంబ్లీ నియోజక వర్గానికి తొలి రోజు గురువారం ఒక్క నామినేషన్ దాఖలు కాలేదని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి / జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకూ రోజూ (ఈ నెల 21వ తేదీ ఆదివారం మినహా) ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ బొమ్మూరు కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తామన్నారు.

నిరుపయోగంగా ఆర్వో ప్లాంట్



వైటీసీలో మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంట్

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని వైటీసీ ప్రాంగణంలో ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురికావడంతో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. వైటీసీలో సుమారు 12 వరకూ వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో సుమారు 120 మందికి పైగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల వైటీసీలోని ఆర్వో ప్లాంట్ మరమ్మత్తులకు గురైంది. దీంతో బయటి నుంచి టిన్నులతో నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా స్థాయి అధికారులు స్పందించి ఆర్వో ప్లాంట్‌కు మరమ్మత్తులు చేయించాలని సిబ్బంది కోరుతున్నారు.

ఉద్భవ్ సాంస్కృతిక ఉత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థిని

కంబాలచెరువు: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఉద్భవ్ వార్షిక సాంస్కృతిక ఉత్సవం 2024ను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ ఉద్భవ్ కార్యక్రమం విద్యార్థులు తమ విభిన్న ప్రతిభను ప్రదర్శించడానికి ఒక శక్తివంతమైన వేదికగా పనిచేస్తుందన్నారు. అలాగే స్టాల్స్ నిర్వహణ ద్వారా వారి వ్యవస్థాపక చతురతను మెరుగుపరుస్తుందన్నారు. పండగలను నిజమైన వేడుకల స్ఫూర్తితో నింపాలన్నారు. ఈ సందర్భంగా ఫిలాసఫీ లెక్చరర్ సత్యం సూర్యనారాయణ, సైకాలజీ లెక్చరర్ జి.రాకేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీశైలశాస్త్రి, అకడమిక్ కోఆర్డినేటర్ డి.సంజీవ్ కుమార్, ఇంగ్లిష్ లెక్చరర్ ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కందుకూరిలో స్పోర్ట్స్ డే

ప్రకాశం నగర్: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్పోర్ట్స్ డే, కళాశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ప్రముఖ చార్టెర్డ్ అక్కౌంటెంట్ శేషగిరి వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్‌లో పాల్గొన్న విద్యార్థినులను అభినందిస్తూ, వారికి పతకాలు, నగదు బహుమతులను అందజేశారు. విద్యార్థినులు నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.రాఘవ కుమారి, వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ రత్నకుమార్, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ బి.అనురాధ సూర్యకుమారి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల కారణంగా శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ ప్రకటించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ లాలాచెరువు ఏరియా, సుబ్బారావు పేట, నారాయణపురం, సైక్లోన్ కాలనీ, గోపాల్ నగర్ వుంత, గాంధీపురం 4, రెవెన్యూ కాలనీ, పోస్టల్ కాలనీ, సాయిదుర్గానగర్‌లలో అంతరాయం కలుగుతుంది.

- ఉదయం 7 నుంచి 10 గంటల వరకూ సావిత్రీ నగర్, రామకృష్ణ నగర్, ఆదర్శ నగర్, కార్తికేయ నగర్, బాలాజీపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోతుంది.
- ఉదయం 8 నుంచి ఒంటి గంట వరకూ సత్యసాయి గురుకులం, మురళీకొండ, నేతాజీ నగర్, బృందావన కాలనీ, ఏసీబీ కాలనీ, రాఘవేంద్రనగర్ కాలనీ, బొమ్మూరు చెరువు, వెంకటగిరి కొండ, బాలాజీపేట సెంటర్ వరకూ, నవభారత్ నగర్, వెంకటేశ్వర కాలనీ, ధవళేశ్వరం, అగ్రహారం, బ్యారేజీ క్వార్టర్స్, క్వారీ కెనాల్ రోడ్, ఎరక్రొండ, బత్తిన సుబ్బారావు కాలనీ, ఇండస్ట్రియల్ కాలనీ, ఎనోసాల్ట్ కంపెనీ, మంతెన సత్యనారాయణ ఆశ్రమం, ఎన్‌హెచ్ రోడ్, టీవీఎస్ సెంటర్‌లలో అంతరాయం కలుగుతుంది.
- సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ మల్లిన నగర్, రామాలయం సెంటర్, జేఎన్ రోడ్డు, తరుణి కాంప్లెక్స్, రామాలయం జంక్షన్, అభయ హాస్పిటల్, రత్న అపార్ట్‌మెంట్ ఏరియాలో సరఫరా ఉండదు.

కడియం: వేమగిరి విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని ఇండస్ట్రియల్ ఫీడర్, వేమగిరి అగ్రికల్చరల్ ఫీడర్‌లకు శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. వేమగిరి గ్రామంతో పాటు ఇండస్ట్రియల్, అగ్రికల్చర్ సర్వీసులకు సరఫరా ఉండదన్నారు.



కడియం మండలం పొట్టిలంకలో సీఎం జగన్‌ను చూడటానికి తరలివచ్చిన జనసందోహం



బొమ్మూరు సెంటర్‌లో వైఎస్సార్ సీపీ జెండాలు పట్టుకుని జగన్‌కు మద్దతు తెలుపుతున్న ప్రజలు



ముఖ్యమంత్రి జగన్‌తో మంత్రి వేణు, ఎంపీ భరత్‌రామ్



సంక్షేమ సారథి కోసం ఎదురుచూపులు



జననేత ఫొటోలు తీసుకుంటూ..



దిష్టి తీస్తున్న యువతులు

మీకు తోడుగా మేమంతా సిద్ధం

- సీఎం జగన్ యాత్రకు ప్రజల నీరాజనం
- రహదారులపై జన గోదారి
- అడుగడుగునా ఆత్మీయ స్వాగతం

రాజమహేంద్రవరం సిటీ/కడియం/ధవళేశ్వరం/ప్రకాశం నగర్/రాజానగరం: మేమంతా సిద్ధం కార్యక్రమంలో భాగంగా బస్సుయాత్ర చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు గురువారం జన గోదారిలా ప్రజలు రోడ్లపైకి తరలివచ్చారు. అడుగడుగునా మద్దతు పలుకుతూ ఆయనను అనుసరించారు. సంక్షేమ ప్రదాత, ఆదర్శ పాలకుడు, ప్రజల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న ప్రియతమ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు మేమంతా సిద్ధం అని ఎలుగెత్తి చాటారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు రోడ్లకు ఇరువైపులా నిలబడి జగన్‌కు మద్దతు పలికారు. అభిమానులు ఆయనను అనుసరించారు. ఈ సందర్భంగా నగరంలోని రోడ్లలన్నీ జన సంద్రంగా మారాయి. మండుటెండలో సైతం లెక్కచేయకుండా ఆయన కోసం ప్రజలు ఎదురు చూశారు. రాజమహేంద్రవరం రూరల్, సిటీ, రాజానగరం నియోజకవర్గాలలో యాత్ర కొనసాగించిన జగన్ అనపర్తి నియోజకవర్గంలోని రంగంపేట మండలం ఎస్టీరాజాపురం గ్రామంలో రాత్రి బస చేశారు.

మంత్రి వేణు ఆధ్వర్యంలో స్వాగతం

ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాకు విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. కడియం మండలం పొట్టిలంక వద్ద గురువారం పెద్ద ఎత్తున గ్రామస్తులు స్వాగతం పలికారు. పొట్టిలంక నుంచి వేమగిరి జంక్షన్ వరకూ మండుటెండను సైతం లెక్క చేయకుండా మహిళలు, యువకులు, వృద్ధులు జాతీయ రహదారిపై జగన్ రాక కోసం ఎదురు చూశారు. పొట్టిలంక వద్ద ప్రజలకు అభివాదం చేస్తూ జగన్ కాన్వాయ్ ముందుకు సాగింది. కడియపులంక శివార్లలోని ఖాళీ స్థలంలో మధ్యాహ్న భోజన విరామానికి ఆగారు. సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు నర్సరీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని చందన నాగేశ్వర్ ద్వారా సీఎం వద్దకు పంపించారు.

కడియపులంక పూల మార్కెట్ సెంటర్‌లో..

కడియపులంక పూలమార్కెట్ సెంటర్‌లో జగన్‌కు భారీ ఎత్తున ప్రజలు స్వాగతం పలికారు. పువ్వులు చల్లుతూ జై జగన్ నినాదాలు చేశారు. బస్సుపైకి ఎక్కి అక్కడున్న ప్రజలకు జగన్ అభివాదం చేశారు. అనంతరం జాతీయ రహదారి మీదుగా వేమగిరి జంక్షన్‌కు చేరుకున్నారు. అక్కడ పెద్ద ఎత్తున నిరీక్షిస్తున్న ప్రజలకు జగన్ బస్సుపైకి వచ్చి అభివాదం చేశారు. పార్టీ నాయకుడు గిరజాల బాబు ఎడ్లబళ్లు, వరి కంకులతో స్వాగతం పలికారు. సీఎం వెంట ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ఉన్నారు. స్వాగతం పలికిన వారిలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, పార్టీ నాయకులు గిరజాల వీర్రాజు (బాబు), పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీను, కొత్తపల్లి శివాజీ, మాజీ సర్పంచ్ వెలుగుబంటి వెంకటాచలం, పార్టీ నాయకులు గుబ్బల నాగార్జున, కట్టా జమీందారు, తోకల శ్రీనివాసరావు, తలారి వరప్రసాద్, సాధనాల శివ, పెన్నాడ జయప్రసాద్, మిరప రమేష్, సత్యం వెంకటరమణ, దేవులపల్లి సరితారాణి, చాటకాల చంటి, కడియం మండలం, ధవళేశ్వరం గ్రామాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు ఉన్నారు. కాగా, కడియం మండలం పొట్టిలంక వద్ద కోటిపల్లి కాలువపై వంతెన నిర్మాణం త్వరితగతిన చేయాలంటూ జగన్‌కు సర్పంచ్ కొత్తపల్లి సత్యవతి వెంకటేశ్వరరావు వినతిపత్రం అందజేశారు.

జనసంద్రమైన మోరంపూడి

తమ అభిమాన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చూసేందుకు పెద్ద ఎత్తున జనం గురువారం సాయంత్రం మోరంపూడి సెంటర్‌కు తరలిరాడంతో ఆ ప్రాంతం జనసంద్రంగా మారింది. మేమంతా సిద్ధం బస్సు యాత్ర 17వ రోజు గురువారం సాయంత్రం 5.34 నిమిషాలకు మోరంపూడి సెంటర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఎంపీ, రాజమహేంద్రవరం ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, నియోజకవర్గ పరిశీలకులు రావిపాటి రామచంద్రరావు, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నందెపు శ్రీనివాస్, నక్కా శ్రీనగేష్ తదితరులు ఘన స్వాగతం పలికారు. మోరంపూడి సెంటర్‌కు చుట్టూ పక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు, వృద్ధులు తరలి వచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సుపైకి చేరుకుని ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. మోరంపూడి సెంటర్‌లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది.

ఉత్సాహంగా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి నగరంలో ప్రజలు నీరాజనాలు పలికారు. తీన్‌మార్ డప్పులతో స్వాగతించారు. మోరంపూడి జంక్షన్, మార్గాని ఎస్టేట్, ఆర్టీసీ బస్ కాంప్లెక్స్, షెల్టన్ హోటల్, తాడితోట జంక్షన్, బైపాస్ రోడ్డు, చర్చిపేట ఆజాద్ చౌక్, దేవీచౌక్, గోకవరం బస్టాండ్, ఆర్యాపురం, మూలగొయ్యి సెంటర్, సీతంపేట రామాలయం, పేపర్ మిల్లు జంక్షన్, కాతేరు రోడ్డు మీదుగా కొనసాగింది. తాడితోట జంక్షన్ వద్ద తన బిడ్డను రక్షించాలంటూ తారక రామ్ అనే చిన్నారి కుటుంబం వేడుకోవడంతో జగన్ బస్సు నుంచి కిందకు దిగారు. ఆ కుటుంబ సభ్యులను పిలిచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న పేపర్ మిల్లు కార్మికులు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వినతిపత్రం అందించారు. కార్మిక నాయకులను బస్సులోకి రప్పించి వివరాలను తెలుసుకున్నారు. సీఎం వెంట మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ మార్గాని భరత్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

జనాలతో కిక్కిరిసిన కూడళ్లు

రాజానగరం నియోజకవర్గంలోకి ప్రవేశించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దారిపొడవునా జనం నీరాజనాలు పలికారు. జాతీయ రహదారిపై దివాన్ చెరువులో గామన్ బ్రిడ్జి సెంటర్, గ్రామ కూడలి, రాజానగరం వైఎస్సార్ జంక్షన్ లలో భారీగా చేరుకున్న జనం జేజేలు పలుకుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో తరలివచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు వారు ప్రదర్శించిన పార్టీ జెండాలతో రహదారి కూడళ్లు కళకళలాడాయి. బస్సు పైనుంచి చేతులు ఊపుతూ జగన్ ముందుకు సాగారు.

జక్కంపూడి రాజా స్వాగతం

బస్సు యాత్ర ద్వారా నియోజకవర్గంలో ప్రవేశించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఘన స్వాగతం పలికారు. రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో పాటు ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్న బస్సులోనే ప్రయాణించారు. రాత్రికి ఏడీబీ రోడ్డులో ఎస్టీరాజాపురం వద్ద ఏర్పాటు చేసిన బసలో సీఎం జగన్ విశ్రమించారు. రాజానగరంలో వైఎస్సార్ సీపీ కూడలి వద్ద ఉన్న వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మిని సీఎం జగన్ ఆప్యాయంగా పలకరించారు. బస్సులోకి రమ్మని ఆహ్వానించారు.



మోరంపూడి సెంటర్‌లో ప్రజలకు నమస్కరిస్తున్న సీఎం జగన్



చిత్రకారుడు రమేష్ రూపొందించిన సీఎం జగన్ చిత్రంతో అభిమానులు



సీఎం జగన్‌తో జక్కంపూడి విజయలక్ష్మి, రాజా

జననేతకు ఊరూరా జేజేలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు జంక్షన్‌కు చేరుకున్న సీఎం జగన్‌కు వేలమంది ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో మహిళలు గుమ్మడి కాయలతో సీఎం జగన్‌కు దిష్టి తీశారు. సీఎం బస్సుపై నుంచి అందరికి అభివాదం చేసుకుంటూ మోరంపూడి జంక్షన్‌కు చేరుకున్నారు. అనంతరం నగర పర్యటన తరువాత కాతేరు మల్లయ్యపేట నుంచి గామన్ బ్రిడ్జి వరకూ బస్సుయాత్ర ఉత్సాహంగా జరిగింది. మంత్రి వేణుగోపాలకృష్ణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడిరాజా, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎంపీ, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పులూరి సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎడ్లబండితో సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న గిరజాల బాబు



మోరంపూడి సెంటర్‌లో చిన్నారుల కూచిపూడి నృత్యం



జాంపేటలో మిన్నంటిన అభిమానం



రాజానగరంలో ప్రజలకు సీఎం జగన్ అభివాదం

ఎన్నికల శిక్షణకు గైర్హాజరైన ఆరుగురి సస్పెన్షన్



మాట్లాడుతున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత

- వారిలో ఐదుగురు స్కూల్ అసిస్టెంట్లు, ఒక డిప్యూటీ తహసీల్దార్
- వివరాలు వెల్లడించిన కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన శిక్షణకు గైర్హాజరైన ఆరుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణకు 73 మంది హాజరుకాలేదన్నారు. వారందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేసి, వివరణ కోరినట్టు తెలిపారు. వారందరూ గురువారం సాయంత్రం హాజరై, తమ వివరణ ఇచ్చారన్నారు. వాటిలో ఆరుగురి వివరణ సహేతుకంగా లేదన్నారు. ఉద్యోగ విధుల్లో క్రమశిక్షణ లేకపోవడాన్ని గుర్తించామన్నారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి జరిగే ఎన్నికల విధుల్లో బాధ్యత గల ప్రభుత్వ ఉద్యోగులుగా మనందరం కలిసి కట్టుగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. సస్పెండ్ చేసిన వారిలో కొవ్వూరు ఆర్ఎంసీ డిప్యూటీ తహసీల్దార్ ఎస్.బంగార్రాజు, రఘుదేవపురం జెడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్ జి.శేఖర్, పల్లంట్ల హైస్కూల్‌కు చెందిన స్కూల్ అసిస్టెంట్లు ఈ.మాధవరావు, కె.మహంకాళరాజు, పురుషోత్తపట్నం ఎంపీపీ పాఠశాల స్కూల్ అసిస్టెంట్ జి.సంతోషిమాత, వేమగిరి ఎంపీపీ పాఠశాల స్కూల్ అసిస్టెంట్ ఎన్.శ్రీనివాసరావు ఉన్నారన్నారు.

జగన్ చేసిన మేలును ప్రచారం చేయండి

- విస్తృతంగా అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి జగన్ చేసిన మేలును, ఆయన ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా యువతకు పిలుపునిచ్చారు. తాడితోట సంహిత కన్వెన్షన్ హాలులో గురువారం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, విద్యార్థి విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ నీలి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘం సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ దాదాపు రూ.1773 కోట్లను వివిధ అభివృద్ధి పనులకు మంజూరు చేయించుకున్నామన్నారు. వాటితో పాఠశాలల భవనాలు, ఆరోగ్య కేంద్రాలు, ఆర్బీకేలు, సచివాలయాలు, ఓపెన్ జిమ్ లు ఇలా ఎన్నో సమకూర్చుకున్నామన్నారు. గత ప్రభుత్వంతో పోల్చితే ఏ గ్రామాన్ని తీసుకున్నా 10 నుంచి 15 రెట్లు అధికంగా మన ప్రభుత్వంలో అభివృద్ధి చేశామన్నారు. సీతానగరం ప్రధాన రహదారి నిర్మాణం, కోరుకొండలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు, కలవచర్లలో 104 ఎకరాల్లో 354 ఇండస్ట్రీలు రావడానికి వీలుగా ఇండస్ట్రియల్ ఎస్టేట్ కి శంకుస్థాపన, రూ.217 కోట్లతో ప్రతి ఇంటికి గోదావరి నీటిని తాగునీటిగా అందించే పథకానికి రూపకల్పన, సీతానగరంలో మల్టీపర్పస్ స్టేడియం, క్రీడా వికాస కేంద్రం ప్రారంభం, దివాన్ చెరువులో రూ.నాలుగు కోట్లతో మరో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ఏర్పాట్లు, ఇరిగేషన్ వర్కులు, వివిధ డిపార్ట్‌మెంట్లకు సంబంధించి ఎన్నో పనులు చేపట్టామన్నారు. ప్రతిదీ రికార్డు పరంగా చూపించడం వలన అన్నిచోట్లా తప్పకుండా చర్చ జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రచారానికి వినియోగించే కరపత్రంలో మొదటి పేజీలో ఏ పథకానికి ఎంతెంత అనే అంకెలు ఉంటాయని, వెనకాల పేజీల్లో ప్రతి పథకం గురించి సమగ్రంగా వివరాలు ఉంటాయన్నారు. పోలింగ్‌కు కేవలం 23 రోజుల సమయం మాత్రమే ఉన్నందున ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి మనం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించాలన్నారు.